# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 17 మార్చి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## ప్రత్యూష మృతి కేసులో లొంగిపోయిన సిద్ధార్థ్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలుగు నటి ప్రత్యూష మృతి కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో శిక్షార్హుడిగా తేలిన సిద్ధార్థ్ రెడ్డి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సోమవారం నాంపల్లి కోర్టు ఎదుట లొంగిపోయాడు. హైకోర్టు విధించిన రెండేండ్ల జైలు శిక్షను సమర్థిస్తూ సుప్రీంకోర్టు తాజాగా తీర్పు ఇవ్వడంతో పాటు నాలుగు వారాల్లోగా లొంగిపోవాలని అతన్ని ఆదేశించింది. ఇన్నాళ్లుగా అమెరికాలో నివసిస్తున్న సిద్ధార్థ్ రెడ్డి తీర్పు అనంతరం భారత్‌కు చేరుకుని నాంపల్లి కోర్టులో హాజరయ్యాడు. 2002 ఫిబ్రవరి 24న సిద్ధార్థ్ రెడ్డి, ప్రత్యూష కలిసి విషం కలిపిన శీతలపానీయం సేవించడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ప్రత్యూష మృతి చెందగా సిద్ధార్థ్ రెడ్డి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ ఘటన ఆత్మహత్య కాదని, హత్యేనని ప్రత్యూష తల్లి దీర్ఘకాలంగా న్యాయపోరాటం కొనసాగించారు. ఈ కేసులో ఆత్మహత్యకు ప్రేరేపించిన అభియోగాలపై ట్రయల్ కోర్టు సిద్ధార్థ రెడ్డికి ఐదేండ్ల జైలు శిక్ష విధించింది. అనంతరం హైకోర్టు శిక్షను రెండేండ్లకు తగ్గించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన సిద్ధార్థ్ రెడ్డి పిటిషన్‌ను కోర్టు కొట్టివేసి హైకోర్టు తీర్పును ఖరారు చేసింది.

### 3 ట్రిలియన్ డాలర్ల

# ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్

- ప్రపంచానికే ఆదర్శంగా తెలంగాణను నిర్మిస్తాం
- సమ్మిళిత వృద్ధి సాధించేందుకు ముందుకు సాగుతాం
- ప్రపంచ నగరాలు, దేశాలతోనే పోటీ
- 67,763 ఉద్యోగాల భర్తీ
- ప్రభుత్వోద్యోగులు, వారి కుటుంబాలకు నగదు రహిత వైద్యం
- ఉభయసభలనుద్దేశించి గవర్నర్ శివ్ ప్రతాప్
- వందేమాతరం గీతాలాపన సమయంలో ఎంఐఎం వాకౌట్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శాసనసభ ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రభుత్వ అభివృద్ధి కార్యాచరణ, సంక్షేమ పథకాలు, ఆర్థిక పురోగతి తదితర అంశాలపై విస్తృతంగా ప్రసంగించారు. రాష్ట్ర బడ్జెట్ ద్వారా ప్రతి పౌరుడు అభివృద్ధిలో భాగస్వామి కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన తెలిపారు.విజన్--2047 కింద తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్ సిద్ధం చేసినట్లు గవర్నర్ పేర్కొన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరుకుందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను జఖక్మజు, ర్జాఖక్మజు, క్ష్మాక్మజు మోడళ్ల ద్వారా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా జఖక్మజు మోడల్ కింద పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని వెల్లడించారు. 2031 నాటికి రాష్ట్ర పట్టణ జనాభా శాతం 53.8కు చేరుకునే అవకాశముందని అంచనా వేశారు.

పాలన వ్యవస్థను బలోపేతం చేయడానికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్లుగా, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని నాలుగు కమిషనరేట్లుగా విభజించినట్లు తెలిపారు. హైడ్రా సంస్థ ప్రభుత్వ ఆస్తులను సుమారు రూ.60 వేల కోట్ల మేర రక్షించిందని చెప్పారు.పెట్టుబడుల పెరుగుదలపై మాట్లాడిన గవర్నర్, బయోఏషియా 23వ ఎడిషన్‌లో రూ.1,700 కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని తెలిపారు. ప్రపంచ స్థాయి టెక్నాలజీ కేంద్రంగా హైదరాబాద్ నిలుస్తోందని, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లలో దాదాపు 20 శాతం ఇక్కడే ఉన్నాయని వెల్లడించారు. రాష్ట్ర ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరగా, ఈ రంగంలో సుమారు 9.39 లక్షల మందికి ఉపాధి లభిస్తున్నదని చెప్పారు. కొడంగల్ ప్రాంతాన్ని ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

సంక్షేమ కార్యక్రమాల అమలుపై కూడా గవర్నర్ ప్రస్తావించారు. గత ఖరీఫ్ సీజన్‌లో రైతు భరోసా పథకం కింద రూ.8,744 కోట్లు పంపిణీ చేయగా, వ్యవసాయ రుణమాఫీ కోసం రూ.20,616 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15.12 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసి, సుమారు 3.38 కోట్ల మందికి సన్న బియ్యం సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు రూ.9,222 కోట్లు ఆదా చేసుకున్నారని వెల్లడించారు. మహిళా స్వయంసహాయక సంఘాలకు రూ.1 లక్ష కోట్లు రుణాలుగా అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేకంగా 'ఈగిల్' బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉద్యోగ నియామక వ్యవస్థలో సంస్కరణలు చేపట్టి, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సహా నియామక సంస్థలను పునర్వ్యవస్థీకరించామని, తక్కువ కాలంలోనే రికార్డు స్థాయిలో 67,763 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించబడినట్లు గవర్నర్ తన ప్రసంగంలో తెలిపారు.

ప్రభుత్వం తెచ్చే ప్రతి పథకం, విధానం, కార్యాచరణలో ప్రజల ఆత్మగౌరవం, సంక్షేమం, సామాజిక సమానత్వం పాటించడమే ప్రజాపాలనకు గీటురాయిగా పాలనలో ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తున్నామన్నారు. 'తెలంగాణ రైజింగ్ విజన్-2047' విజన్ డాక్యుమెంట్‌ను

మిగితా 4వ పేజీలో

> **మార్చి 30 వరకు తెలంగాణ బడ్జెట్ సమావేశాలు**
>
> **20న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న భట్టి విక్రమార్క**
>
> వివరాలు 4వ పేజీలో

## ఇరాన్‌పై మరోసారి విరుచుకుపడ్డ ట్రంప్

- ఇజ్రాయెల్ సాయంతో ముప్పును అంతం చేస్తామన్న అమెరికా అధ్యక్షుడు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత 47 ఏళ్లుగా ఇరాన్ ప్రపంచానికి ముప్పుగా మారిందని, ఇజ్రాయెల్ సాయంతో ఆ ముప్పును పూర్తిగా అంతం చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఇరాన్‌లోని 7 వేలకుపైగా లక్ష్యాలపై దాడులు జరిపినట్లు ట్రంప్ తెలిపారు. వాటిలో అధిక భాగం వాణిజ్య, సైనిక స్థావరాలేనని చెప్పారు. ముఖ్యంగా క్షిపణులు, డ్రోన్లు తయారు చేసే పరిశ్రమలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించినట్లు వెల్లడించారు. సోమవారం కూడా ఇలాంటి మూడు కేంద్రాలపై దాడులు జరిగినట్లు తెలిపారు. మరోవైపు గత వారం రోజుల వ్యవధిలో జరిగిన దాడుల్లో వందకు పైగా ఇరాన్‌కు చెందిన నౌకలు ధ్వంసమయ్యాయని ట్రంప్ పేర్కొన్నారు. దీంతో ఆ దేశ నౌకాదళం, వాయుసేనకు భారీ నష్టం వాటిల్లి దాదాపు నిర్వీర్యమయ్యాయని ఆయన వ్యాఖ్యానించారు.

### దాడులు ఆపే వరకు

## సైనిక చర్యలు కొనసాగిస్తాం

- ఇరాన్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఇరాన్ కాల్పుల విరమణ చర్చలకు సిద్ధంగా ఉందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను టెహ్రాన్ ఖండించింది. తమ దేశం ఎప్పుడూ కాల్పుల విరమణ లేదా చర్చలను కోరలేదని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. అవసరమైతే ఎంతకాలమైనా దేశ రక్షణ కోసం సైనిక చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అరాగ్చీ మాట్లాడుతూ, "అమెరికా చట్టవిరుద్ధమైన యుద్ధాన్ని ముగించే వరకు ఇరాన్ పోరాటం కొనసాగిస్తుంది. మేం ఎప్పుడూ కాల్పుల విరమణ కోరలేదు. చర్చలు కూడా కోరలేదు. ఇప్పటికే చర్చలు జరుగుతున్న సమయంలోనే మాపై దాడులు జరిగాయి. అలాంటి పరిస్థితుల్లో మళ్లీ చర్చలకు కారణం కనిపించడం లేదు" అని పేర్కొన్నారు.

అమెరికా దాడుల కారణంగా తమ దేశంలోని కొన్ని అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయని, అందులోని అణు పదార్థం ప్రస్తుతం శిథిలాల కిందే ఉందని అరాగ్చీ తెలిపారు. భవిష్యత్తులో వాటిని వెలికితీసే అవకాశం ఉన్నప్పటికీ ప్రస్తుతం అలాంటి ప్రణాళిక లేదని చెప్పారు. అవసరమైతే అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ పర్యవేక్షణలోనే ఆ ప్రక్రియ జరగాలని ఇరాన్ భావిస్తున్నట్లు తెలిపారు.

అమెరికాతో జరిగిన అణు చర్చల సమయంలో ఇరాన్ పెద్ద రాజీకి సిద్ధమైందని విదేశాంగ మంత్రి వెల్లడించారు. తమ వద్ద ఉన్న 60 శాతం శుద్ధి చేసిన యురేనియాన్ని తక్కువ స్థాయికి తగ్గించేందుకు సిద్ధమని అప్పట్లో ప్రతిపాదించామని చెప్పారు.

మిగితా 4వ పేజీలో

## శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ



- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణలిలి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ జాతి గౌరవం, నిరంతర స్ఫూర్తికి ప్రతీకగా భావించే "తెలంగాణ తల్లి" విగ్రహాన్ని శాసనసభ ప్రాంగణంలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం బడ్జెట్ సమావేశాల ప్రారంభ రోజున నిర్వహించబడింది.ల్ల ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి గవర్నర్ శాసనసభ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం పునరుద్ధరించిన శాసనమండలి భవనం ఎదురుగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులు అర్పించారు.

## ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం

- నిలిపి ఉన్న కారును లారీ ఢీకొని ఇద్దరు మృతి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఔటర్ రింగ్ రోడ్డుపై రోడ్డు పక్కన నిలిపి ఉన్న కారును వెనుక నుంచి వేగంగా వచ్చిన అశోక్ లేలాండ్ లారీ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందిన విషాదకర సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదం సోమవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండల పరిధిలో జరిగింది.

శామీర్‌పేట సీఐ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని మౌలాలి ఆర్టీసీ కాలనీకి చెందిన మొహమ్మద్ యూసుఫ్ ఖాన్ (51), షేక్‌పేటకు చెందిన మొహమ్మద్ హుస్సేన్ (48) టీఎస్ 09 ఈడీ 3303 నంబర్ గల ఆడి కారులో ఈసీఐఎల్ నుంచి తూప్రాన్ వైపు ఓఆర్ఆర్ మార్గంలో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కారును రోడ్డు పక్కన నిలిపిన సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావంతో కారులో ఉన్న ఇద్దరూ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పనున్న జీవన్ రెడ్డి?

- ఈ నెల 25న రాజీనామా చేసే అవకాశాలు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో జగిత్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన పాత ఫ్లెక్సీలను ఆయన అనుచరులు తొలగించి, కొత్తగా కేవలం జీవన్ రెడ్డి ఫోటోతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. కొత్త ఫ్లెక్సీలలో కాంగ్రెస్ పార్టీ రంగులు, పార్టీ నాయకుల చిత్రాలు లేకపోవడం గమనార్హం.గత 42 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న జీవన్ రెడ్డి, గత రెండేళ్లుగా తనకు ఆశించిన స్థాయిలో గౌరవం దక్కలేదన్న భావనతో పార్టీని వీడాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నెల 25న స్థానిక ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసి పార్టీ పదవులకు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయనున్నట్లు సమాచారం.

ఇటీవల చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి పార్టీని వీడవద్దంటూ బుజ్జగించే ప్రయత్నం చేసినప్పటికీ ఆయన ఒప్పుకోలేదని తెలుస్తోంది. పార్టీని వీడే ముందు తన అనుచరులు, సన్నిహితులతో జీవన్ రెడ్డి సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఇదే సమయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే దిశగా ఆయన కార్యాచరణ చేపడుతున్నారు. సోమవారం తన అనుచ రులు, అభిమానులు, రైతులతో కలిసి బైక్ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందించాలని వినతిపత్రం సమర్పించారు.

ఇటీవల విలేకరుల సమావేశంలో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కూడా ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఆయన తీసుకుంటున్న చర్యలను బట్టి చూస్తే కాంగ్రెస్ పార్టీని వీడే నిర్ణయం దాదాపు ఖరారైనట్లే కనిపిస్తోంది. పార్టీని వీడిన అనంతరం పెద్ద ఎత్తున సభ ఏర్పాటు చేసి మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ప్రస్తుతం ఏ పార్టీలో చేరాలన్నదానిపై తుది నిర్ణయం తీసుకోలేదని, కాంగ్రెస్‌లో మాత్రం కొనసాగే ఉద్దేశం లేదని జీవన్ రెడ్డి తన సన్నిహితులతో చెప్పినట్లు తెలుస్తోంది.

## శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల నిరసన ప్రదర్శన



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలకు 6 గ్యారెంటీల పేరుతో హామీ ఇచ్చి అందులో ఏ ఒక్కటి సంపూర్ణంగా అమలు చేయకుండా మోసం చేస్తున్నదని, కావున 6 గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ డిమాండ్ చేశారు. దీనిపై శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. సోమవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ముందు హైదరాబాద్ గన్ పార్క్ అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు ప్లకార్డులను ప్రదర్శిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి

మిగితా 4వ పేజీలో

## ప్రజాప్రతినిధులు జాగ్రత్తగా మాట్లాడండి

- అసెంబ్లీ సమావేశాలప్పుడు చిట్‌చాట్‌లు వద్దు
- సీఎల్పీ భేటీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

'ఇప్పటిదాకా గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను చెప్పుకుంటూ వచ్చాం.. ఇంకా వాటి గురించే చెబుతూ కూర్చోలేం.. ఆ సమయం అయిపోయింది, అందువల్ల మన భవిష్యత్ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయబోతున్నామనే విషయాలపై దృష్టి సారించండి...అసెంబ్లీ కార్యకలాపాలు కొనసాగే సమయంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడొద్దు.. ఒకవేళ మాట్లాడినా జాగ్రత్తగా మాట్లాడండి.. సభలో వాదోపవాదాలు చేస్తూ మీరే ప్రతిపక్షంలాగా వ్యవహరించొద్దు.. తద్వారా ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేయొద్దు...' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు హితబోధ చేశారు. సభలో మాట్లాడే అంశాలకు సంబంధించి ప్రభుత్వ విప్‌లు సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. చర్చలు పక్కదారి పట్టకుండా, సమయం వృధా కాకుండా సభను సమర్థవంతంగా నడిపేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లోని శాసనమండలి కాన్ఫరెన్సు హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశాన్ని నిర్వహించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ భేటీకి హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ...తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడో బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికల గురించి గవర్నర్ ప్రసంగంలో విడమరిచి చెప్పామన్నారు. ఆ ప్రసంగం ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ లాంటిదని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల హాజరు విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని సూచించారు. ఇతరత్రా కారణాలు చెప్పి గైర్హాజరు కావొద్దని హెచ్చరించారు. సభకు విధిగా హాజరవటం ద్వారా అనేక అంశాలపై అవగాహన, పట్టు సాధించాలని దిశా నిర్దేశం చేశారు. మహిళా శాసన సభ్యులకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుందని చెప్పారు. వారు చర్చల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. అసెంబ్లీ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాల్లో పర్యటించటం ద్వారా అక్కడి సమస్యలు, ప్రభుత్వ విధానాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నప్పుడు తమకు మాట్లాడే అవకాశమే ఇవ్వలేదని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. సీఎల్పీ నేతలుగా ఉన్న భట్టి విక్రమార్కకు, జానారెడ్డికి కూడా మైక్ ఇవ్వలేదని గుర్తు చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు సభకు రాకుండా అడ్డుకున్నారని వాపోయారు. అలాంటి కష్టాలన్నింటినీ దాటుకుంటూ తాము తిరిగి సభలోకి అడుగుపెట్టామని తెలిపారు. రాజకీయాల్లో వ్యక్తిగత డ్యామేజీ ఉండదని ముఖ్యమంత్రి తెలిపారు. అది వ్యవస్థ మొత్తాన్ని డ్యామేజ్ చేస్తుందని పేర్కొన్నారు. అందువల్ల వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ కొనసాగుతుందని వివరించారు. అందువల్ల ప్రజా సమస్యలపై దృష్టి కేంద్రీకరించి పని చేయాలని కోరారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై ఫోకస్ పెట్టాలని సూచించారు. 99 రోజుల ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభకు అలా వచ్చి.. ఇలా వెళ్తామంటే

## కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు అన్యాయం

- చోద్యం చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కృష్ణా, గోదావరి నదుల జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు విమర్శించారు. అసెంబ్లీలోని బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు దాసోహమై తెలంగాణ ప్రయోజనాలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. గోదావరి, బనకచర్ల అంశాలపై ఢిల్లీలో జరిగిన సమావేశానికి సంబంధించిన మినిట్స్ వచ్చి నెల దాటినా, అందులో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం ఎందుకని ప్రశ్నించారు.

ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి రాష్ట్ర నీటి హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. లేఖల డ్రామాలు మానుకుని స్పష్టమైన వైఖరి ప్రకటించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం -- నల్లమలసాగర్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని తమ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలో పేర్కొనగా, దీనికి దీటుగా తెలంగాణ ప్రభుత్వం కూడా కృష్ణా -- గోదావరి జలాల్లో చుక్క నీరు కూడా వదులుకోమని స్పష్టం చేయాల్సిందని అన్నారు. తెలంగాణ గవర్నర్ ప్రసంగంలో ఈ అంశాలపై కఠిన వైఖరి ప్రకటించకపోవడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమని హరీష్‌రావు పేర్కొన్నారు.

**అసెంబ్లీ సమావేశాలు పెంచాలని బీఆర్ఎస్ డిమాండ్**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ఈ నెల 30 వరకు మాత్రమే నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో కనీసం మార్చి 31వ తేదీ వరకు అయినా సభను కొనసాగించాలని తాము డిమాండ్ చేసినట్లు బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు తెలిపారు. బీఏసీ సమావేశం అనంతరం బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.ఆదివారాలు, పండుగల కారణంగా పని దినాలు తగ్గిపోతాయని, బడ్జెట్‌పై చర్చించేందుకు తగిన సమయం దక్కదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 16న గవర్నర్ ప్రసంగం, 17, 18 తేదీల్లో ధన్యవాద తీర్మానంపై చర్చ, 19న ఉగాది సెలవు, 20న బడ్జెట్ ప్రవేశపెట్టడం, 21న రంజాన్ సెలవు, 22న ఆదివారం, 23 నుంచి 26 వరకు బడ్జెట్‌పై చర్చలు, 27న శ్రీరామనవమి సెలవు, 28న బిల్లు ప్రవేశపెట్టడం, 29న ఆదివారం, 30న బిల్లుల ఆమోదం ఉండనున్నట్లు స్పీకర్ తెలిపారని వివరించారు. బడ్జెట్‌పై చర్చించేందుకు నాలుగు రోజులు సరిపోవని, ఆదివారాల్లో కూడా సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

హౌస్ కమిటీల ఏర్పాటు ఆలస్యమైందని, ఎప్పుడు నియమిస్తారని ప్రశ్నించామని హరీశ్‌రావు తెలిపారు. త్వరలో నియమిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ప్రతిరోజూ ప్రశ్నోత్తరాల సమయం ఉండాలని కోరగా మంగళవారం మినహా మిగతా రోజుల్లో నిర్వహిస్తామని తెలిపినట్టు వెల్లడించారు.

గతంలో అసెంబ్లీ సమావేశాలు ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యేవని, బీఆర్ఎస్ హయాంలో 9 గంటలకు నిర్వహించామని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 10 గంటలకు మార్చిందని, మళ్లీ 9 గంటలకే సభ ప్రారంభం కావాలని స్పీకర్‌ను కోరినట్టు తెలిపారు. ఆరు గ్యారెంటీల అమలుపై ప్రైవేటు మెంబర్ బిల్లుకు అవకాశం ఇవ్వాలని, బీఆర్ఎస్ తరఫున ఇద్దరు

మిగితా 4వ పేజీలో




## ఉపాధి లేకపోతే చావే శరణ్యం.. ప్రజావాణిలో వికలాంగుడి ఆవేదన..

**-- వందల దరఖాస్తులు ఇచ్చినా ఫలితం లేదు : వికలాంగుడు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఓ వికలాంగుడు తనకు జీవనోపాధి కల్పించాలని కోరుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్లకార్డుతో నిరసన వ్యక్తం చేశాడు. వేములవాడ పట్టణానికి చెందిన ఓదెల నరేష్ పుట్టుకతోనే వికలాంగుడు. రెక్కాడితే కానీ డొక్కాడని పేద కుటుంబానికి చెందిన అతను తనకు ఏదైనా ఉద్యోగం లేదా జీవనోపాధి కల్పించాలని కోరుతూ చాలా సంవత్సరాలుగా ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు ఇస్తున్నట్లు తెలిపాడు.

తన సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులను పలుమార్లు కలిసినా ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోలేదని నరేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటివరకు వందల సంఖ్యలో దరఖాస్తులు ఇచ్చినా గత ప్రభుత్వం తన సమస్యను పరిష్కరించలేదని, కనీసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా స్పందిస్తుందనే ఆశతో ఉన్నానని పేర్కొన్నాడు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో తన వినతిని తెలియజేస్తూనే ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి దారి చూపలేదని ఆయన వాపోయాడు. ఈ నెలలో అయినా తనకు ఏదైనా ఉద్యోగం లేదా జీవనోపాధి కల్పించకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశాడు.

## కేంద్ర సాహిత్య అవార్డు అందుకున్న నందిని సిద్ధారెడ్డికి శుభాకాంక్షలు..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
నాగేటి సాలల్ల నా తెలంగాణ అంటూ తెలంగాణ ఆత్మను అక్షరాల్లో పలికించిన ప్రముఖ కవి, అక్షర యోధుడు నందిని సిద్ధారెడ్డి కి కేంద్ర సాహిత్య అవార్డు వరించడం తెలంగాణకు గర్వకారణం. తెలంగాణ అసిత్వాన్ని, సంస్కృతిని తన సాహిత్యంలో అద్భుతంగా ప్రతిబింబించిన ఆయన కృషి నిజంగా వెలకట్టలేనిది. ఈ అవార్డు ఆయన సాహితీ ప్రస్థానానికి దక్కిన అసలైన గుర్తింపు అని తెలంగాణ గ్రాడ్యుయేట్ ఫోరం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు చిలముల జయవర్ధన్ తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆయన నుంచి మరెన్నో గొప్ప రచనలు వెలువడాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాల పోస్టర్ ఆవిష్కరణ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులతో రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీ ఎస్ సీ, బీకాం, బీఏ తదితర కోర్సుల వివరాలతో సిద్ధం చేసిన పోస్టర్లను కలెక్టర్ గరిమ అగ్రవాల్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులతో కలిసి విడుదల చేశారు. త్వరలో దోస్త్ వెబ్ సైట్ ద్వారా అడ్మిషన్లు పొందాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోర్సులు, సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్ల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, అడ్మిషన్ ఇంచార్జి జి శ్రీధర్ రావు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ ప్రసాద్, ఐ క్యూ ఏ సీ కోఆర్డినేటర్ డాక్టర్ శోభారాణి, డాక్టర్ కృష్ణ ప్రసాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఫిజిక్స్, డాక్టర్ కే శారద అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, డాక్టర్ కే వై కరుణ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కెమిస్ట్రీ, ఆఫీస్ ఇంచార్జి గోపికృష్ణ, రమేష్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద లింగాపురం పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య నిపుణుల శిబిరం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజులపాటు నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాల కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య నిపుణుల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పర్యవేక్షణలో పరిశీలించారు. శిబిరంలో స్త్రీల వైద్య నిపుణులు, పిల్లల వైద్య నిపుణులు, ఎముకల వైద్య నిపుణులు, నేత్ర వైద్య నిపుణులు, దంత వైద్య నిపుణులు మరియు జనరల్ ఫిజీషియన్లు పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. స్త్రీల ప్రత్యేక వైద్య నిపుణులు గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహించడంతో పాటు క్యాన్సర్ సంబంధిత వ్యాధుల నిర్ధారణకు పరీక్షలు చేశారు. నేత్ర వైద్య నిపుణులు కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్ ఆధ్వర్యంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న 296 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అదేవిధంగా టిబి వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పొగాకు వినియోగాన్ని తగ్గించాలని వైద్యులు సూచించారు.

## సిరిసిల్లలో ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు..

- **పీసీపీఎన్డీటీ చట్టం అమలు కచ్చితంగా పాటించాలని డీఎంహెచ్ఓ హెచ్చరిక**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
సోమవారం రోజున సిరిసిల్ల పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులు మరియు స్కానింగ్ సెంటర్లలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలకు డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ నాగేంద్రబాబు అధ్యక్షత వహించారు.

తనిఖీల సందర్భంగా స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు పలు ముఖ్య సూచనలు చేశారు. ప్రతి రేడియాలజిస్ట్ గరిష్ఠంగా రెండు ఆసుపత్రుల్లో మాత్రమే స్కానింగ్ సేవలు అందించాలని సూచించారు. అలాగే ఫారం--ఎఫ్ ఆడిట్ సమయంలో గర్భిణీ స్త్రీల రిఫరల్ స్లిప్ మరియు స్కానింగ్ ఫిలిం ఫారం--ఎఫ్ కు తప్పనిసరిగా జతపరచాలని ఆదేశించారు.

అదేవిధంగా స్కానింగ్ సర్టిఫికెట్లలో నమోదు చేసిన యంత్ర నంబర్, వాస్తవంగా ఉపయోగిస్తున్న స్కానింగ్ యంత్ర నంబర్ సరితూగేలా ఉండాలని తెలిపారు. గర్భస్థ శిశు వు లింగ నిర్ధారణ చేయడం చట్టపరంగా పూర్తిగా నిషేధితమని, ఈ విషయంలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే పీసీపీఎన్డీటీ చట్టం ప్రకారం రూ.10,000 జరిమానాతో పాటు మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించబడుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో రాజకుమార్ మరియు సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు నందిని సిధారెడ్డికి దక్కడం గర్వకారణం



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
కేంద్ర ప్రభుత్వం ప్రతి యేటా అందించే అత్యున్నత సాహిత్య పురస్కారం అయిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు--2025 ప్రముఖ తెలంగాణ కవి, రచయిత నందిని సిధారెడ్డి కి దక్కడం పట్ల తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా నందిని సిధారెడ్డి ని కేసీఆర్ అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కరోనా సమయంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాన్ని, ముఖ్యంగా మానవ సంబంధాల్లో ఏర్పడిన విచ్ఛిన్నతలను కవిత్వ రూపంలో హృద్యంగా ఆవిష్కరించిన దీర్ఘ కవితా సంపుటి 'అనిమేష' కు ఈ ప్రతిష్టాత్మక అవార్డు రావడం ఎంతో గొప్ప విషయం అని అన్నారు. తెలంగాణ మట్టివాసన తెలిసిన కవిగా, తన సాహిత్య సృజన ద్వారా తెలంగాణ జీవన విధానాన్ని అక్షరబద్ధం చేసిన గర్వించదగ్గ కవి నందిని సిధారెడ్డి అని కేసీఆర్ పేర్కొన్నారు. మెదక్ జిల్లా కేంద్రంగా మంజీరా రచయితల సంఘాన్ని ఏర్పాటు చేసి, అన్ని వర్గాల ప్రజల సమస్యలు, సామాజిక సమానత్వం వంటి అంశాలపై రచనలు చేస్తూ తన కలాన్ని, గళాన్ని ప్రజల కోసం వినిపించిన రచయితగా సిధారెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో తన పాటలు, సాహిత్యం ద్వారా ప్రజలను ఆలోచింపజేస్తూ ఉద్యమ కవిగా తెలంగాణ ప్రజల అభిమానాన్ని నందిని సిధారెడ్డి చూరగొన్నారని కేసీఆర్ పేర్కొన్నారు.

## బీజేపీ నిరంకుశ పాలనపై యువజన కాంగ్రెస్ సమరభేరి,

### ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడి...



**బలగం టీవీ, ఢిల్లీ:**
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ ధోరణులను నిరసిస్తూ, జాతీయ యువజన కాంగ్రెస్ పిలుపు మేరకు సోమవారం ఢిల్లీలో 'పార్లమెంట్ ముట్టడి' కార్యక్రమం ఉధృతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చుక్క రాజశేఖర్ తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి చురుగ్గా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చుక్క రాజశేఖర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరితో ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని మండిపడ్డారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో, రైతుల సమస్యలను పరిష్కరించడంలో మరియు సామాన్యుల నడ్డి విరుస్తున్న ధరల నియంత్రణలో బీజేపీ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. "ప్రజల హక్కులను కాపాడడం, యువతకు న్యాయం చేయడం కోసం యువజన కాంగ్రెస్ ఎల్లప్పుడూ ముందుంటుంది. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పే వరకు మా పోరాటం ఆగదు." అని ఆయన స్పష్టం చేశారు.

దేశవ్యాప్తంగా తరలివచ్చిన వేలాది మంది యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పార్లమెంట్ దిశగా మార్చ్ నిర్వహించారు. "బీజేపీ హఠావో -- దేశ్ బచావో" అంటూ భారీ ఎత్తున నినాదాలు చేశారు. జాతీయ స్థాయిలో యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ ముట్టడి కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ ఉద్యమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి చుక్క రాజశేఖర్ పాల్గొని, తెలంగాణ యువత గళాన్ని హస్తినలో వినిపించారు. అవసరమైతే రాబోయే రోజుల్లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## వెలిజిపూర్ గ్రామంలో సర్పంచ్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కి క్షిరాభిషేకం..

**బలగం, టీవీ ఇల్లంతకుంట:**



11/6 కెనాల్‌కు నిధులు విడుదల చేయడం ద్వారా వెల్జీపురం గ్రామంలోని వందల ఎకరాలకు సాగునీటి సమస్యలు తీరనున్న నేపథ్యంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కి గ్రామస్తులు క్షిరాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్థానిక సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ మాట్లాడుతూ.. రైతుల సమస్యల పట్ల ఎల్లప్పుడూ స్పందిస్తూ ఇచ్చిన మాట నిలబెట్టుకొని 11/6 కెనాల్‌కు నిధులు విడుదల చేయించడంలో కృషి చేసిన ఎమ్మెల్యే కవ్వం పల్లి మరోసారి రైతు బాంధవుడుగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ గుండా వెంకన్న, ఏఎంసీ డైరెక్టర్ కంకణాల రాంప్రసాద్ రెడ్డి, వార్డు సభ్యులు గొల్ల కోమటి మల్లవ్వ శంకర్, బొజ్జ శ్రీనివాస్, సంగెపు వేణు, సంగెం ముత్తవ్వ, దేశెట్టి కవిత, బాబు చందర్, చిట్యాల శ్రీనివాస్, మహిళా రైతులు, గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# లక్ష్యం ప్రకారం ముందుకు వెళ్లాలి..



- ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక లో భాగంగా జిల్లా అధికారి తమకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా పథకాలు అమలు చేయాలని, లక్ష్యం ప్రకారం ముందుకు వెళ్లాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక పై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులతో కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12 వ తేదీ వరకు 99 రోజుల పాటు ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.మహిళా సంఘాల భవనాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని, ఈ మేరకు ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. తమ పరిధిలోని అన్ని అంశాలపై యాక్షన్ ప్లాన్ అమలు చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

## పశువుల ఆరోగ్యం కాపాడితేనే రైతులకు ఆర్థిక భద్రత

- పాడి పశువులను వ్యాధుల నుంచి రక్షించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

పశువుల సంరక్షణకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ మరియు జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో సిద్ధం చేసిన ప్రచార రథాన్ని సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. పశువుల పెంపకందారులు తమ జీవాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ఆర్థిక నష్టాలను నివారించేందుకు ప్రభుత్వం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా వేయిస్తోందని తెలిపారు. రైతులు, పశువుల పెంపకందారులు ముందస్తుగా టీకాలు వేయించి పశువులను రోగాల బారి నుంచి రక్షించుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాడి పశువులు, నాలుగు నెలల వయస్సు దాటిన ఎద్దులు మరియు దూడలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాలని పేర్కొన్నారు. పశు వైద్య డాక్టర్లు మరియు సిబ్బంది మొత్తం 26 బృందాలుగా ఏర్పడి వచ్చే నెల ఏప్రిల్ 9వ తేదీ వరకు జిల్లాలో టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తారని చెప్పారు. అలాగే జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రచార రథం ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, 142 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని సంబంధిత కార్యాలయాలకు పంపించారు. వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు ఆయా శాఖల తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎస్సీ యాక్షన్ ప్లాన్-2025-26 అమలు..

- వాహనాలు, సోలార్ పంప్ పథకాల కోసం దరఖాస్తులు ఆహ్వానం
- జిల్లా కలెక్టర్ అండ్ చైర్మన్ గరిమ అగ్రవాల్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

హైదరాబాద్‌లోని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ 12-03-2026న ఎస్సీ యాక్షన్ ప్లాన్--2025-26ను విడుదల చేశారు. ఈ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బ్యాంకు అనుసంధానంతో పలు ఆర్థిక సహాయ పథకాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ పథకాలలో రవాణా రంగం కింద EV 2వీలర్, EV 3 వీలర్ పథకాలు ఉండగా, వ్యవసాయ రంగం కింద సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ పథకం అమలు చేయనున్నారు.

ఈ నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని మండలాలు మరియు మున్సిపాలిటీ పరిధిలో నివసించే షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు ఈ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధికారులు సూచించారు. వ్యవసాయేతర పథకాల కోసం వయస్సు 21 నుండి 50 సంవత్సరాల వరకు, వ్యవసాయ ఆధారిత పథకాల కోసం 21 నుండి 60 సంవత్సరాల వరకు ఉండాలి. అభ్యర్థులు 17-03-2026 నుండి 24-03-2026 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులు ఇంటర్నెట్ ద్వారా లేదా మీసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవచ్చు. అభ్యర్థుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000 లోపు, పట్టణ ప్రాంతాల్లో (మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్, నగర పంచాయతీ) రూ.2,00,000 లోపు ఉండాలి.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు అవసరమైన పత్రాలు:**

ఆధార్ కార్డు
రేషన్ కార్డు / ఫుడ్ సెక్యూరిటీ కార్డు
కుల ధృవీకరణ పత్రం (మీసేవా జారీ చేసింది)
ఆదాయ ధృవీకరణ పత్రం (మీసేవా జారీ చేసింది)
శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగ పథకాల కోసం)
ఈవీ ద్విచక్ర వాహనాల కోసం గిగ్ కార్మికులకు ప్రాధాన్యత. ్రశీమ్ఫ్శీ, ాాషఱస్త్రుం, క్ష్ముఖజూఱసశీ, ఖఎవతీ వంటి సంస్థల నుండి సంబంధిత సర్టిఫికెట్ సమర్పించాలి
పట్టాదార్ పాస్‌బుక్ (సోలార్ పంప్ కోసం కనీసం 2 ఎకరాల భూమి అవసరం)
సదరం సర్టిఫికెట్ (పీడబ్ల్యూడీ అభ్యర్థులకు)
పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో

ఈ పథకాల ద్వారా అర్హులైన ఎస్‌సి అభ్యర్థులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం లభిస్తుందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంఘం అధికారులు తెలిపారు. అవసరమైన అభ్యర్థులు నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# ఆర్టీసీ కార్మికులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం..

- కంచర్ల రవి గౌడ్ ఆగ్రహం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఆ హామీలన్నింటినీ గాలికి వదిలేశారని కంచర్ల రవి గౌడ్ మండిపడ్డారు. ఆదివారం సిరిసిల్ల తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నేత కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికులను ఈ ప్రభుత్వం పూర్తిగా మోసం చేసిందని అన్నారు. ఆనాటి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీని అభివృద్ధి చేసి కార్మికులకు అండగా నిలిచిన మహానాయకుడు అని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీని పూర్తిగా ప్రైవేటీకరణ చేసి కార్మికులను రోడ్డున పడేయాలనే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అధికారంలో లేనప్పుడు ఒక




మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట మాట్లాడటం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటైందని తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఆర్టీసీ కార్మికులతో కలిసి పెద్ద స్థాయిలో ఉద్యమం చేపడతామని కంచర్ల రవి గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరెల్లి వినయ్, వడ్లూరి వేణు, ఎండి అజ్జు, వరుణ్, ప్రశాంత్, సాయి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 'ఆరు గ్యారెంటీ'లపై బీజేపీ సమరభేరి



- ఎల్లారెడ్డిపేటలో అర్ధనగ్న ప్రదర్శన...

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శిస్తూ.. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు భారీ నిరసన చేపట్టాయి. మండల అధ్యక్షులు రేపాక రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి, ప్రభుత్వ వైఖరిపై ధ్వజమెత్తారు.

స్థానిక పాత బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేసిన బీజేపీ నాయకులు, ప్రభుత్వంపై వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. అనంతరం భారీ ర్యాలీగా తరలివెళ్లి ఎస్సై రాహుల్ రెడ్డికి ఫిర్యాదు అందజేశారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన ఉధృతం కావడంతో సీఐ వెంకటేష్, ఎస్సై రాహుల్ రెడ్డి సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని ధర్నాను విరమింపజేశారు.

ఈ సందర్భంగా రేపాక రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌పై తీవ్ర విమర్శలు చేశారు. రైతు బంధు నిధుల విడుదల పెండింగ్‌లో ఉండటం. సన్న వడ్లకు బోనస్ ఊసే లేకపోవడం. మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 పథకం అమలు కాకపోవడం. వృద్ధాప్య పింఛన్ల పెంపును విస్మరించడంపై ఆయన మండిపడ్డారు. "ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయడం లేదు. వెంటనే అన్ని గ్యారెంటీలను నెరవేర్చకపోతే, ప్రజలను కలుపుకొని ఆందోళనలను మరింత ఉధృతం చేస్తాం." అని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి మున్సిపల్ వైస్ చైర్మన్ రూ.3.11 లక్షల విరాళం

**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రోజున సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్ తన వంతు బాధ్యతగా దేవాలయ పునర్నిర్మాణం కోసం రూ.3 లక్షల 11 వేల రూపాయలను దేవాలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా దార్ల సందీప్ మాట్లాడుతూ.. శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయం సిరిసిల్ల ప్రాంతానికి ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందని తెలిపారు. దేవాలయ పునర్నిర్మాణం ద్వారా భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించబడతాయని పేర్కొన్నారు. ఈ పుణ్యకార్యంలో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించి శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగస్వాములై స్వామి వారి ఆశీర్వాదాలకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు, పద్మశాలి సంఘం ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 30 వరకు బడ్జెట్ సమావేశాలు

## 20న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న భట్టి విక్రమార్క

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ బడ్జెట్ సమావేశాలను ఈ నెల 30 వరకు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకున్నారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశాలు మార్చి 16న ప్రారంభమయ్యాయి. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం సభను స్పీకర్ మంగళవారం (మార్చి 17)కు వాయిదా వేశారు.

సమావేశాల వ్యవధిపై స్పీకర్ గడ్డం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో పాటు ఎమ్మెల్యేలు హరీష్ రావు, కేపీ వివేకానంద, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కూనంనేని సాంబశివరావు, కౌసర్ తదితరులు పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాలకు ఉగాది, రంజాన్, శ్రీరామ నవమి పండుగలతో పాటు ఆదివారాల్లో సెలవులు ఉండనున్నాయి. మార్చి 17, 18 తేదీలలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ జరగనుంది. మార్చి 20న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అనంతరం బడ్జెట్ పద్దులపై విస్తృతంగా చర్చలు కొనసాగనున్నాయి.

# దాడులు ఆపే వరకు సైనిక చర్యలు కొనసాగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్‌కు అణ్వాయుధాలు తయారు చేయాలనే ఉద్దేశం లేదని నిరూపించడానికే ఆ ప్రతిపాదన చేసినట్లు వివరించారు. యుద్ధంలో తొలిసారిగా 1.5 టన్నుల వార్‌హెడ్‌లతో కూడిన 'సెజ్జిల్' క్షిపణులను ప్రయోగించినట్లు ఇరాన్ ప్రకటించింది. అత్యధిక వేగంతో ప్రయాణించే ఈ క్షిపణులను అడ్డుకోవడం ఐరన్‌డోమ్ వ్యవస్థకు సవాల్‌గా మారిందని తెలిపింది. ఆదివారం వేకువజామున యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, జోర్డాన్‌లోని నాలుగు అమెరికా ఎయిర్‌బేస్‌లపై దాడులు జరిగినట్లు పేర్కొంది. ఉపగ్రహ చిత్రాల ప్రకారం అమెరికా స్థావరాల్లోని సుమారు 80 శాతం వ్యూహాత్మక రాడార్లు ధ్వంసమయ్యాయని వెల్లడించింది.

# శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని ప్రకటించినప్పటికీ రెండున్నరేండ్లు గడిచినా ఇప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదని తెలిపారు. మొదటి గవర్నర్ ప్రసంగంలోనే ఈ హామీ ఇచ్చారని, ప్రస్తుతం ఇది మూడో గవర్నర్ ప్రసంగం అయినప్పటికీ గ్యారెంటీల అమలుపై స్పష్టత లేదన్నారు. 6 గ్యారెంటీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతు సంక్షేమంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోం దన్నారు.తెలంగాణ సంపదను దోచుకుంటూ రైతులకు వెన్నుపోటు పొడుస్తూ రాహుల్ గాంధీకి వెయ్యి కోట్లు కప్పం కడుతున్నారని ఆరోపించారు. రైతులకు రాహుల్ బంధు కాదని, రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదవాళ్ల నడ్డి విరిచి, పెన్షన్లు పెంచే మాటను మరిచారని, మహాలక్ష్మి పథకం మాట మరచి మహిళలను నట్టేట ముంచారని విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అవకాశం ఇవ్వకుండా విపక్షాల గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు. అలాగే విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు సుమారు రూ.10 వేల కోట్ల మేర ఉన్నాయని, వాటి చెల్లింపుపై ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలో లోపాలు ఉన్నాయని తెలిపారు. ఈ అన్ని అంశాలపై బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిగ్గదీస్తామని, ప్రజల తరపున సమాధానాలు కోరుతామని చెప్పారు. 6 గ్యారెంటీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేసే వరకు తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నిరసన నేపథ్యంలో అసెంబ్లీ పరిసరాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ క్రమంలో అసెంబ్లీ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులకు మాట్లాడే అవకాశం కల్పించాలని కోరినట్టు చెప్పారు.

**బీఏసీ మినిట్స్ అమలు చేయాలి**

బీఏసీ మినిట్స్‌ను అమలు చేయకపోతే తదుపరి సమావేశాలను బహిష్కరిస్తామని స్పీకర్‌కు చెప్పినట్టు హరీశ్‌రావు పేర్కొన్నారు. సభలో ముఖ్యమంత్రి అసత్య వ్యాఖ్యలు చేస్తూ అసెంబ్లీ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఇందుకు సీఎం వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రివిలేజ్ మోషన్లపై డిప్యూటీ స్పీకర్ చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో స్పీకర్ బాధ్యత వహించాలని కోరినట్టు తెలిపారు.అసెంబ్లీ గ్రంథాలయం పరిస్థితి దారుణంగా ఉందని బీఏసీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని, మొత్తం 19 అంశాలపై చర్చించాలని కోరినట్టు హరీశ్‌రావు వెల్లడించారు.

# గండిపేటలో చేపల వేటకెళ్లి.. ముగ్గురు మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**

చేపల వేటకెళ్లిన ముగ్గురు యువకులు నీట మునిగి మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. నార్సింగ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఇబ్రహీం బాగా ప్రాంతానికి చెందిన కార్తీక్ (23), గోవర్ధన్ (25), వెంకటేష్ (22) గండిపేట మండలంలోని ఇస్తాం చెరువు వద్దకు ఆదివారం సాయంత్రం చేపల వేట కోసమని వెళ్లారు. చేపలు పడుతున్న తరుణంలో కాలుజారి చెరువులో గల్లంతయ్యారు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ముగ్గురి మృతదేహాలను వెలికి తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబాల్లో విషాదం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఫార్మ్‌హౌస్ డ్రగ్స్ ఘటనపై పారదర్శక విచారణ జరపాలి..

## అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు డ్రగ్ టెస్ట్ చేయించుకుందాం.. ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ సవాల్




**బలగం టీవీ, హైదరాబాద్**

మొయినాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఫార్మ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ ఘటనపై పూర్తి స్థాయి, లోతైన మరియు పారదర్శక విచారణ జరపాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈ ఘటనలో ఎవరు ఉన్నా, వారు ఏ పార్టీకి చెందిన వారైనా, ఎంతటి పెద్దవారైనా సరే చట్టం ముందు సమానంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిన్న రాత్రి జరిగిన విందులో టీడీపీ ఎంపీ మహేష్ యాదవ్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన వ్యక్తులు పాల్గొన్నారని సమాచారం ఉందని, ఆ ఫార్మ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికాయని పోలీసులు చెబుతున్న నేపథ్యంలో నిజానిజాలను పూర్తిగా వెలికితీయాలని అన్నారు. ఈ ఘటనను ఆధారంగా చేసుకుని కాంగ్రెస్ సోషల్ మీడియా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కావాలని బురద జల్లుతోందని తీవ్రంగా ఖండించారు.

పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సహవాస దోషంతో కేటీఆర్‌పై అనవసర విమర్శలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన హోదాకు తగ్గట్టు వ్యవహరించకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. మొయినాబాద్ ఫార్మ్‌హౌస్ ఘటనకు కేటీఆర్‌ను లింకు పెట్టడం అంటే మోకాలికి బోడి గుండు కు సంబంధం అంటగట్టినట్లేనని వ్యాఖ్యానించారు.

డ్రగ్స్ గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ నేతలకు ఉందా అని ప్రశ్నించిన శ్రవణ్, చెర్లపల్లిలో రూ.12 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను ముంబై పోలీసులు పట్టుకున్న ఘటనను ప్రస్తావించారు. ముంబై పోలీసులు వచ్చే వరకు రాష్ట్రంలోని ఈగల్ పోలీసులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇది సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం కాదా అని ఆయన ప్రశ్నించారు.

2025 సంవత్సరంలో రాష్ట్రంలో 2,572 డ్రగ్స్ కేసులు నమోదయ్యాయని, గంజాయి వినియోగం అదుపు లేకుండా పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. శాసన మండలిలో డ్రగ్స్ అంశంపై తాను అడిగిన ప్రశ్నకు సమాధానంగా రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగం 30 శాతం పెరిగిందని ప్రభుత్వం తెలిపిందని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనే బదులు రాజకీయాలకు మళ్లిస్తోందని విమర్శించారు.

డ్రగ్స్ అంశంపై ఎవరైనా అనుమానాలు వ్యక్తం చేస్తే, డ్రగ్స్ టెస్ట్‌కు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని శ్రవణ్ స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగం పూర్తయ్యగానే అసెంబ్లీ ప్రాంగణంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అన్ని పార్టీల శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు వరుసగా నిలబడి డ్రగ్ టెస్ట్ చేయించుకుందామని ఆయన సవాల్ విసిరారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులందరూ డ్రగ్స్ టెస్ట్‌కు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

కేటీఆర్ ప్రభుత్వం లోపాలను ఎత్తి చూపుతున్నందుకే కాంగ్రెస్ నేతలు ఆయనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని శ్రవణ్ విమర్శించారు. గతంలో మంత్రి కొండా సురేఖ కేటీఆర్‌పై చేసిన అనుచిత ఆరోపణలపై కోర్టు గట్టి హెచ్చరికలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. డ్రగ్స్ వ్యవహారంలో కేటీఆర్‌పై పిచ్చి ఆరోపణలు చేసే కాంగ్రెస్ నేతలను కోర్టులోకి లాగుతామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వివిధ వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నుంచి ధన్యవాదాలు ఆశించే స్థితిలో లేదని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలు, కౌలు రైతులకు ఇచ్చిన వాగ్దానాలు, మహిళలకు, యువతకు, వృద్ధులకు ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని అన్నారు. 100 రోజుల్లో హామీలు నెరవేర్చుతామని చెప్పి ఇప్పుడు 1000 రోజులు దగ్గరపడుతున్నా అమలు చేయలేకపోయిన ప్రభుత్వానికి ప్రజలు ధన్యవాదాలు చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు.కేసీఆర్ హయాంలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపామని, ప్రస్తుత ప్రభుత్వం నిజాయితీగా చర్యలు తీసుకుంటే డ్రగ్స్ నియంత్రణలో బీఆర్ఎస్ సహకరించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే డ్రగ్స్ వంటి తీవ్రమైన సమస్యను రాజకీయాలకు ఆపాదించడం తగదని స్పష్టం చేశారు. ఈ ప్రెస్‌మీట్‌లో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర చారి కూడా పాల్గొన్నారు.

# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్

(మొదటి పేజీ తరువాయి)

ఆవిష్కరించామని తెలిపారు. 2025-26లో రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) రూ.17.82 లక్షల కోట్లు కాగా, 10.7 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందని అన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.99 శాతమనీ, రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కి చేరిందని వివరించారు.

మల్కాజిగిరి, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించామన్నారు. కొత్తగా తెస్తున్న క్యూర్ చట్టంతో హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు,హైడ్రాను ఒకటే పాలనా పరిధిలోకి తీసుకొస్తామని చెప్పారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌తోపాటు, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, కొత్తగా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లుగా పునర్‌వ్యవస్థీకరి ంచామని అన్నారు. కాలుష్యం నుంచి తప్పించేందుకు హిల్ట్ పాలసీని అమలు చేస్తున్నామన్నారు. రూ.60 వేల కోట్ల విలువైన 1,045 ఎకరాలకుపైగా ఆక్రమణలు, కబ్జాలకు గురైన చెరువు భూములు, ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నామని వివరించారు. 55 కిలోమీటర్ల మూసీ రివర్ ఫ్రంట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టును ప్రజా ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. ఓఆర్‌ఆర్-ఆర్‌ఆర్‌ఆర్ మధ్యలో 360 కిలోమీటర్ల ప్యూర్ (పెరి-అర్బన్ రీజియన్ ఎకానమీ) ప్రాంతాన్ని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించామనీ, ఇక్కడ పలు రకాల పరిశ్రమలను ప్రోత్సహిస్తామన్నారు. కొడంగల్ ఏరియా ఇండస్ట్రియల్ హబ్‌ను అభివృద్ధి చేసేందుకు రాబోయే రేడియల్ రోడ్డు వెంట మల్టీ ప్రొడక్ట్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తామని అన్నారు. జహీరాబాద్‌లో 3,245 ఎకరాల్లో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ స్మార్ట్ సిటీ అభివృద్ధి జరుగుతోందన్నారు. ఓఆర్‌ఆర్-ఆర్‌ఆర్‌ఆర్ మధ్య అనుసంధానానికి రేడియల్ రోడ్లను నిర్మించే ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. హైదరాబాద్ నుంచి ఫ్యూచర్ సిటీ, అమరావతి మీదుగా బందర్ పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ హైదరాబాద్-అమరావతి మధ్య ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మించనున్నట్టు వివరించారు. శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్, బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సులను ప్రస్తావించారు. రైతుభరోసా రూ.8,744 కోట్లు, సన్నరకం ధాన్యానికి బోనస్‌గా రూ.19,099 కోట్లను రైతులకు చెల్లించామన్నారు. రూ.20,616 కోట్లను రైతుల ఖాతాల్లో వేసి 25 లక్షల మందికిపైగా రైతులను రుణ విముక్తులను చేశామన్నారు. తెలంగాణ భూ భారతి చట్టం 2025ను, ప్రత్యేకంగా భూధార్ వ్యవస్థను తీసుకొచ్చామని వివరించారు. కృష్ణా, గోదావరి నదుల జలాల వాటాల్లో రాష్ట్ర ప్రయోజనాలను రక్షించేందుకు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, పునరావాస ప్రక్రియను కొన్ని నెలల్లో పూర్తి చేస్తామన్నారు.కొనసాగుతున్న ప్రాజెక్టులను మూడేండ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వివరించారు.

రాష్ట్రంలో 15.12 లక్షల కొత్త రేషన్ కార్డులను జారీ అయ్యాయనీ, పాత రేషన్ కార్డుల్లో 19.44 లక్షల మంది కొత్త సభ్యుల పేర్లను చేర్చామని తెలిపారు. అందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. పేదలకు 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యమనీ, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు కేటాయించామని చెప్పారు. ఈ పథకాన్ని మొత్తం రూ.22,500 కోట్ల అంచనా వ్యయమవుతుందనీ, ఇప్పటివరకు 3,24,536 ఇండ్లు మంజూరు చేయగా 2,62,449 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయనీ, వీటికోసం ఇప్పటివరకు రూ.5,073.84 కోట్లు విడుదల చేశామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే లక్ష్యంతో ఉచిత బస్సు ప్రయాణం ద్వారా రూ.9,222 కోట్ల లబ్ధి చేకూర్చామనీ, రూ.500కే ఎల్పీజీ సబ్సిడీ సిలిండర్లు ఇస్తున్నామనీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కోసం రూ.3,900 కోట్లు ఖర్చు చేశామన్నారు. సంక్షేమ హాస్టళ్లలో డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 212 శాతం పెంచామని చెప్పారు. పాఠశాలల్లో రూ.706 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల పనులు చేపట్టామనీ, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రజా ప్రభుత్వం నిర్మిస్తున్నదని చెప్పారు. వీటిలో 60 స్కూళ్ల నిర్మాణం, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇచ్చిందన్నారు. ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నుంచి రూ.4,903.44 కోట్లు సాయం తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిందని వివరించారు. మంచిరేవుల గ్రామంలో యంగ్ ఇండియా పోలీస్ రెసిడెన్షియల్ స్కూల్‌ను స్థాపించామన్నారు.

దేశంలో మొట్టమొదటిసారిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. మాతృమరణాల నిష్పత్తిని ఆరు కంటే తక్కువ, శిశు మరణాల నిష్పత్తిని ఏడు కంటే తక్కువ తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని గవర్నర్ అన్నారు. వరంగల్ హెల్త్ సిటీ, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్), నిమ్స్ విస్తరణ, కొత్తగా ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం, 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలను చేపట్టామని వివరించారు. ఈ ఏడాది చివరి నాటికి వీటి సేవలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. 'ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక', ప్రజావాణి, డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థ వంటి పలు అంశాలను గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. కులగణన, బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ, డ్రగ్స్ నివారణకు ఈగల్ ఏర్పాటు వంటి విషయాలు ప్రస్తావించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 67,763 పోస్టులను భర్తీ చేసిందనీ, ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా నగదు రహిత ఆరోగ్య సేవలు అందిస్తున్నామన్నారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులు, సమ్మక్క సారలమ్మ జాతర, గద్దెల పునర్నిర్మాణం, ఎకో టెంపుల్ టూరిజం వంటి అనేక అంశాలను గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు.